సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



తాకట్టు ఆడిట్ ▸ అంతా కనికట్టు

- ఖాతాదారుల్లో గుబులు
- తాకట్టు బంగారం విడిపించుకునేందుకు ప్రయత్నాలు
- బ్రాంచీల్లో బంగారం ఆడిట్ నిర్వహించే పనిలో అధికారులు!
- గార ఎస్‌బీఐలో బంగారం మాయం కేసులో జిల్లాలోని ఎస్‌బీఐ పెద్దతలకాయపై అనుమానాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

గార ఎస్‌బీఐలో జరిగిన బంగారం మాయం ఘటన బ్యాంకు వర్గాలను కుదిపేస్తోంది. దీని ఎఫెక్ట్‌తో శనివారం మిగతా బ్రాంచ్‌ల్లో తాకట్టు బంగారాన్ని ఆడిట్ చేసి పరిశీలించినట్లు సమాచారం. మరోవైపు ఖాతాదారులు గార బ్రాంచ్‌కు క్యూ కడుతున్నారు. తమ బంగారం విడిపించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

పెద్ద తల కాయపై అనుమానం..

గార ఎస్‌బీఐలో ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారంలో 7 కిలోలు మాయమైన ఘటన పాఠకులకు విదితమే. ఈ విషయంపై జిల్లాలో ఎస్‌బీఐకి చెందిన పెద్ద తలకాయపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయనకు తెలిసే ఇటువంటి బాగోతాలు జరిగినట్టు సమాచారం. సాధారణంగా బ్యాంకుల్లో ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారంపై ప్రతి నెలా, మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సరానికొకసారి ఆడిట్ నిర్వహిస్తారు. ఆడిట్‌లో అంతా సక్రమంగా ఉంటే సమస్య లేదు. తేడా ఉంటే



గార ఎస్‌బీఐ వద్ద తాకట్టు పెట్టిన బంగారం విడిపించుకునేందుకు వచ్చిన ఖాతాదారులు

బాధ్యుల్ని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు రికవరీ చేయాలి. గారలో దాదాపు 7కిలోల బంగారం అదృశ్యమవ్వడంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ, ఎప్పటికప్పుడు నిర్వహించిన ఆడిట్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కన్సల్టెన్సీలతో సంబంధాలు..

గార బ్రాంచ్‌కు సంబంధించే కాదు జిల్లాలో అనేక బ్రాంచ్‌లలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు ప్రైవేటు లోన్ కన్సల్టెన్సీలతో సన్నిహిత సంబంధాలు ఉన్నట్టు సమాచారం. అత్యాశతో కొందరు ఉద్యోగులు తమ బ్యాంకుల్లో ఉన్న బంగారాన్ని కన్సల్టెన్సీల వద్ద పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరైతే ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని గుట్టు చప్పుడు కాకుండా స్ట్రాంగ్ రూమ్‌ల్లోని సేఫ్‌ల నుంచి తీసుకెళ్లి ప్రైవేటు కన్సల్టెన్సీల వద్ద పెట్టి పెద్ద ఎత్తున రుణాలు తీసుకుంటున్నారు. ఆ సొమ్మును షేర్ మార్కెట్‌ల్లోనూ, మ్యూచ్‌వల్ ఫండ్స్‌ల్లోనూ పెడుతున్నట్టు తెలుస్తోంది. ఇలా చేసిన వాళ్లు కొంతమందికి లాభాలు రాగా, మరికొందరు నష్టపోయినట్టు సమాచారం. లాభపడిన వారు బ్యాంకుల నుంచి తరలించిన బంగారాన్ని విడిపించి, మళ్లీ బ్యాంకుల్లో పెట్టగా, నష్టాలొచ్చిన వాళ్లు ప్రైవేటు కన్సల్టెన్సీల వద్ద పెట్టిన బంగారాన్ని వారాలు, నెలలైనా తిరిగి తీసుకువచ్చి బ్యాంకుల్లో పెట్టడం లేదన్న వాదనలు ఉన్నాయి. శ్రీకాకుళం నగరంలోని చాలా మంది ప్రైవేటు లోన్ కన్సల్టెన్సీల వద్ద ఈ రకంగా ఖాతాదారుల బంగారాన్ని కుదవ పెట్టి సొమ్ము తీసుకుని సొంతానికి వాడుకున్నట్టు భోగట్టా. ఈ కన్సల్టెన్సీలపై ఇప్పటికే పోలీసు యంత్రాంగం దృష్టిసారించింది. పోలీసు ఉన్నతాధికారులు కూడా రంగంలోకి దిగి, బ్యాంకు ఉద్యోగులతో లోన్ కన్సల్టెన్సీలతో జరిగిన ఫోన్ సంభాషణలు, చాటింగ్‌లపై ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

మా బంగారం ఎంత భద్రం..



గార బ్రాంచ్‌లో జరిగిన వ్యవహారంతో అవసరాల కోసం బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్న ఖాతాదారుల్లో ఆందోళన మొదలైంది. తాము తాకట్టు పెట్టిన బంగారాన్ని మాయం చేసి, కొందరు ఉద్యోగులు తమ అవసరాలకు వాడుకుంటున్నారని.. తమ బంగారం ఎంత భద్రంగా ఉందో లేదో అని భావించి బ్యాంకుల వైపు పరుగులు తీస్తున్నారు.

లాకర్ల కోసం..

గార: గార ఎస్‌బీఐ వద్ద ఖాతాదారుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఖాతాదారులు వ్యక్తిగతంగా లాకర్లలో దాచుకున్న బాండ్లు, బంగారంను తీసుకెళ్లిపోతున్నారు. కుమ్మరిపేటకు చెందిన జల్లు వెంకటరమణమూర్తి, గార గ్రామానికి చెందిన మార్పు రవి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. తాజాగా జరిగిన సంఘటనతో వీరు లాకర్లు తెరవడానికి శనివారంఇక్కడకు వచ్చారు. సిబ్బంది అడ్డుకోవడంతో గార సీఐ ఎస్.కామేశ్వరరావు, బ్రాంచి మేనేజర్ సీహెచ్ రాధాకృష్ణలు కలుగుజేసుకొని లాకర్లు తెరుచుకోవచ్చని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

స్వచ్ఛమైన పాలనకు కేరాఫ్ ▸ వైఎస్సార్‌సీపీ

- యువజన విభాగం సమావేశంలో ధర్మాన కృష్ణదాస్
- ఎంపీకి అన్ని ఆస్తులు ఎక్కడివి..?

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నీతివంతమైన పాలనకు కేరాఫ్ వైఎస్సార్‌సీపీ అని, తమ పార్టీలో అవినీతికి ఆస్కారం ఉండదని, తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఎంపీ రామ్మోహన్ నాయుడుకు సవాలు విసిరారు. తాను నీతిమంతుడినని చెప్పుకుంటున్న ఎంపీకి శ్రీకాకుళం నడిబొడ్డున కోట్లాది రూపాయల ఆస్తులెలా వచ్చాయో చెప్పాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఎంపీకి లేదని తేల్చి చెప్పారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆత్మీయ కలయిక సమావేశం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో గల ఓ ప్రైవేటు హోటల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా గుర్తుకురాని శబరిమల నుంచి ఆమదాలవలస రోడ్డు రైలు ఎన్నికలు సమీపిస్తున్న వేళ గుర్తుకురావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్రం నుంచి ఒక్క సంస్థనైనా ఎంపీ తీసుకురాలేకపోయారని అన్నారు.



మాట్లాడుతున్న కృష్ణదాస్. చిత్రంలో స్వరూప్, సూరిబాబు

జగనన్నను సీఎం చేద్దాం

జగనన్నను మళ్లీ సీఎం చేద్దామని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్ అన్నారు. సచివాలయానికి 20 మంది చొప్పున మండలానికి 500 మంది నియోజకవర్గానికి 2వేల మందితో నియోజకవర్గ యువజన కమిటీలు వేశామన్నారు. జిల్లా సమస్యలను ఎంపీ గాలికొదిలేసి ఏదో గాలి కబుర్లు చెబితే ప్రజలెవ్వరు నమ్మబోరన్నారు. రానున్న ఎన్నికల్లో 175కి 175 స్థానాలు కైవసం చేసుకునేలా యువజన విభాగం పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, యువజన విభాగం మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

'ఎక్కువ కేసులు రాజీ చేయాలి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. ప్రతి ఒక్క న్యాయమూర్తి వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలని వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించారు.

న్యూస్‌రీల్

టీడీపీ మాజీ సర్పంచ్‌కు రూ.10వేల పింఛన్



గున్నయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లీలా, వెల్ఫేర్ అసిస్టెంట్ ఖగేశ్వరరావు

నందిగాం: మండలంలోని దేవుపురం మాజీ సర్పంచ్, కొండతెంబూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు శిష్టు గున్నయ్యకు డయాలసిస్ పింఛన్ మంజూరు చేశారు. మండలంలోని తెలుగుదేశం ముఖ్య నాయకుల్లో గున్నయ్య ఒకరు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. డయాలసిస్ చేయించుకుంటున్న నేపథ్యంలో ఆ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేశారు. దీంతో స్థానిక వాలంటీర్ బమ్మిడి లీలా, వెల్ఫేర్ అసిస్టెంట్ ఖగేశ్వరరావు, లక్ష్మీనారాయణ గున్నయ్య ఇంటి వద్దకు వెళ్లి రూ. 10వేల పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా గున్నయ్య మాట్లాడుతూ పార్టీ చూడకుండా పింఛన్ అందజేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.

తుఫాన్‌పై విద్యుత్ శాఖ అప్రమత్తం

అరసవల్లి: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలని సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశించారు. ఆయన శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయం నుంచి మిగిలిన విశాఖ, విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల ఎస్‌ఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందస్తు చర్యలపై ఏలూరు, రాజమహేంద్రవరం ఎస్‌ఈలకు ఆదేశాలిచ్చారు. అలాగే స్థానిక జిల్లాలో రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డీఎస్‌ఎస్) కింద స్థానిక సర్కిల్ పరిధిలో రూ.459.18 కోట్లతో లాస్ డిటెక్షన్, మోడరనైజేషన్ పనుల వివరాలను సర్కిల్ ఎస్ ఈ ఎన్.కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లాలో 33 కేవీ ఫీడర్లలో అంతరాయాలను పూర్తిగా తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా ఇంధన శాఖ సెక్రటరీ కూడా తుఫాన్ ప్రభావిత సర్కిళ్లలో చేపట్టనున్న చర్యలపై సూచనలు చేశారు.

'మిచాంగ్' అలర్ట్

- తుఫాన్ నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు కనీసం 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ వేత్తలు చెబుతుండడంతో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. రైతులు వరికోతలు కోసిన వారు పనలు పెట్టుకోవాలని, కోతలు కోయని వారు పొలాల్లో ఉంచి నేలవాలకుండా జాడలు తీయాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదని దండోరా వేయించాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్నిశాఖల అధికారులు తీర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల్ని అప్రమత్తం చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అత్యవసర సమయంలో 08942-240557కు ఫోన్‌చేయాలని తెలిపారు. అవసరమైన సామగ్రి సిద్ధం చేసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు.

తుఫాన్ నేపథ్యంలో పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ వివరించారు.

- వరి పంట గింజ గట్టిబడి కోతకు సిద్ధంగా ఉంటుంది. అందుకే కంబైన్డ్ హర్వెస్టర్ ఉపయోగించి వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో ఉంచాలి. వర్షానికి తడవకుండా ఆరబెట్టుకోవడం, తగినన్ని టార్పాలిన్లు, పాలిథీన్ పట్టాలను అందుబాటులో ఉంచుకోవాలి.
- వరి పంట కోసి పనలు చేనులో ఉంటే తక్షణమే పనలను కట్టలు కట్టి గూడు/కుప్పలు పోయాలి.
- తడిసిన పనల్లో మొలకలు రాకుండా 5% ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి.
- ఖరీఫ్ పత్తి, మిరప పంటల చేనుల్లో వర్షపు నీరు నిలవకుండా, నీరు వేగంగా, సులభంగా కొట్టుకుపోయే విధంగా చేల గట్లలో ఎక్కువ సంఖ్యలో వాలుకు నిలువుగా గండ్లు చేయాలి.
- తీతకు సిద్ధమైన పత్తి కాయల నుంచి పత్తిని తీయడం, మిరప లో తయారైన పచ్చి మిరప, పండు మిరపను చేను నుంచి కోసి బూజు పట్టకుండా చూసుకోవాలి.
- వానలు తగ్గిన తర్వాత విల్ట్ తెగు లు సోకకుండా బ్లైటాక్స్/మ్యాన్‌కో జెబ్ డ్రెంచింగ్ విధానం, కెఎన్‌వో3 పొటాషియం నైట్రేట్ పిచికారీ తదితర విషయాలపై అవగాహన పెంచుకోవాలి.



కోసిన వరి చేను మోసుకెళ్తున్న దృశ్యం

కంట్రోల్ రూం ఫోన్ నెంబర్
08942-240557

● దీప కాంతులు



నరసన్నపేట ఇందిరానగర్ వద్ద శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు దీపాలు వెలిగించారు. కూర్మ గ్రామానికి చెందిన నారోత్తమ్ ప్రవచనాలు చేశారు. - నరసన్నపేట



క్లుప్తంగా

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు రిఫరీగా సూరిబాబు



శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు రిఫరీగా జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సంపతిరావు సూరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంకమ్మ చౌదరి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. సూరిబాబు జెడ్పీహెచ్‌స్కూల్ చిలకపాలెంలో పీడీ(ఎస్‌ఏ–పీఈ)గా పనిచేస్తున్నారు. అస్సాం రాష్ట్రంలోని గౌహతి వేదికగా బీడబ్ల్యూఎఫ్ సూపర్–100 అంతర్జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2023 పోటీలు ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీల కోసం ఆయన ఆదివారం ఇక్కడ నుంచి పయనం కానున్నారు.

బీసీ కార్పొరేషన్ సూపరింటెండెంట్‌పై వేటు

శ్రీకాకుళం: బీసీ సంక్షేమ శాఖలో సూపరింటెండెంట్‌గా 2014లో శ్రీకాకుళంలో పనిచేసిన జీపీఎస్ఎన్ మూర్తిని విధుల నుంచి డిస్మిస్ చేశారు. ఆయనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం ఈ చర్యలు తీసుకున్నారు. 2014లో ఆయన తన ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడ్డారని పలువురు ఉద్యోగులు, సిబ్బంది లోకాయుక్తను ఆశ్రయించారు. స్పందించిన లోకాయుక్త అప్పటి ఐటీడీఏ పీఓ ఎల్ శివశంకర్‌ను విచారణ అధికారిగా నియమించింది. రంగంలోకి దిగిన శివశంకర్ సమగ్ర విచారణ చేసి నివేదికను లోకాయుక్తకు సమర్పించారు. 23 ఆరోపణలపై లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తే విచారణ నివేదికల్లో 18 ఆరోపణలు వాస్తవాలుగా తేలాయి. దీంతో ప్రభుత్వం ఆయన్ని విధుల నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. మూర్తి ప్రస్తుతం అనకాపల్లి బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు.

టీడీపీ హయాంలో భారీ స్కామ్

- అప్పటి రోడ్లు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై విచారణ చేయాలి
- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో స్పీకర్ తమ్మినేని ధ్వజం
- కీలక శాఖల ప్రగతిపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

అరసవల్లి: టీడీపీ హయాంలో జిల్లాలో రూ.400 కోట్ల ఏఐఐబీ పనుల్లో భారీ స్కామ్ జరిగిందని స్పీకర్ తమ్మినేని సీతారాం ఆరోపించారు. దీనిపై విచారణ జరిపిస్తే లెక్కలు తేలుతాయని అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులు, ఏషియన్ బ్యాంకు రుణాలతో రోడ్ల నిర్మాణాలతో పాటు టిడ్కో ఇళ్ల నిర్మాణాల విషయంలో కూడా జిల్లాకు చెందిన టీడీపీ నేతలు కాంట్రాక్టర్ల నుంచి భారీగా వాటాలు బొక్కేశారని అన్నారు. పనులు చేయకుండా ఉన్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని పీఆర్ ఎస్ఈ వీఎస్ఎన్ మూర్తికి ఆదేశించారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణమూర్తి, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ ఎ.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్‌కు జెడ్పీ తరఫున చైర్‌పర్సన్ విజయ ఘనంగా సత్కరించారు.

సిమ్మెంట్ సర్దుబాట్లు ఎలా..?



రాజాం, ఎచ్చెర్ల తదితర నియోజకవర్గాల్లో ఇదివరకు జరిగిన సిమెంట్ సర్దుబాట్లను అధికారులు త్వరగా తేల్చాలి. విద్యాశాఖాధికారులు పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

– బెల్లాన చంద్రశేఖర్, ఎంపీ, విజయనగరం

నిబంధనలు పాటించండి



నాడు–నేడు పనుల్లో నిబంధనలు పాటించాలి. పూర్తిగా నాణ్యతగా పనిచేయాలి. ఇంజినీరింగ్ అధికారులతో సాధ్యాసాధ్యాలను చెక్ చేసిన తర్వాతే నాడు–నేడు పనులకు పాఠశాలలను ఎంపిక చేయాలి.

– రెడ్డి శాంతి, పాతపట్నం ఎమ్మెల్యే

జిల్లాకు అధిక ప్రాధాన్యం



మన జిల్లాకు సీఎం వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. టీడీపీ జెడ్పీటీసీ బుచ్చిబాబు ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నాం. పాతపట్నం నియోజకవర్గంలోనే వందలాది కోట్లతో మంచినీటి ప్రాజెక్టులను మంజూరు చేయడమే కాకుండా ప్రారంభానికి సిద్ధమవుతున్నా టీడీపీ నేతలు కనిపించడం లేదా..? ఈ నెల 12న పలాసకు సీఎం వస్తున్నారు. జిల్లాలో 17 మండలాలను కరువు ప్రాంత మండలాలుగా గుర్తించి త్వరలో అధికారులు ప్రకటించనున్నారు.

– పిరియా విజయ, జిల్లా పరిషత్ చైర్ పర్సన్

చంద్రబాబు పేరు చెప్తే గుర్తొచ్చే పథకమేది..?



చంద్రబాబు 14 ఏళ్ల సీఎంగా పనిచేసినా ఆయన పేరు చెబితే గుర్తొచ్చే పథకమేదీ లేదు. వైఎస్సార్, వైఎస్ జగన్ పేర్లు చెబితే ఎన్నోపథకాలు గుర్తుకు వస్తాయి. ప్రభుత్వాన్ని విమర్శించే ముందు టీడీపీ జెడ్పీటీసీ పూర్తి సమాచారం తెలుసుకోవాలి. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబుకి, రైతు పక్షపాతిగా పేరు తెచ్చుకున్న జగన్‌కు చాలా తేడా ఉంది. కిడ్నీ ఆస్పత్రి, వైఎస్సార్ సుజలధార వంటివి జగన్ మార్కు.

– ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే, నరసన్నపేట.

కొత్తగా 16,112 ఇళ్ల మంజూరుకు ప్రతిపాదనలు



జిల్లాలో కొత్తగా 16,112 ఇళ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. రెండు రోజుల్లో వర్ష సూచనలున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు తగిన ముందస్తు చర్యలు చేపట్టాలి. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలు జిల్లాలో మూడు చోట్ల ప్రారంభించాం.

– శ్రీకేష్ బి.లాఠకర్, కలెక్టర్

మీరొచ్చి ఏం లాభం..?

సర్వసభ్య సమావేశానికి కచ్చితంగా విజయనగరం, మన్యం జిల్లాలకు చెందిన పలు కీలక శాఖల జిల్లా స్థాయి అధికారులను పూర్తి స్థాయి సమాచారంతో హాజరుకావాలి. కింది స్థాయి అధికారులు వచ్చి ఏం లాభం. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తాను.

– ఆర్.వెంకట్రామన్, జెడ్పీ సీఈఓ

అప్‌లోడ్‌లో జాప్యం

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనుల ప్రతిపాదనలను అప్‌లోడ్ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఒడిశా సరిహద్దు నియోజకవర్గాల్లో ఒడిశా బియ్యం కొనుగోలు చేస్తున్న మిల్లర్లపై చర్యలు చేపట్టాలి.

– దువ్వాడ వాణి, జెడ్పీటీసీ, టెక్కలి

జెడ్పీటీసీలు ఏమన్నారంటే...

- హిరమండలం జెడ్పీటీసీ బుచ్చిబాబు మాట్లాడుతూ బొంతు ఎత్తిపోతల పథకం సగంలో పనులు నిలిపివేశారని ఆరోపించారు.
- సంతబొమ్మాళి జెడ్పీటీసీ వసంతరెడ్డి మాట్లాడుతూ కె.లింగూడు పాఠశాల శిథిలావస్థకు చేరినప్పటికీ అధికారులు కొత్త భవనాన్ని నిర్మించడం లేదన్నారు.
- రణస్థలం జెడ్పీటీసీ టొంపల శీతారాం మాట్లాడుతూ కుమ్మరిపేటలో పాఠశాల కూలిపోయే స్థితికి చేరుకుందన్నారు. కొచ్చర్ల జగనన్న లేఅవుట్‌కు కరెంటివ్వాలని కోరారు.
- జి.సిగడాం జెడ్పీటీసీ కాయల రమణ మాట్లాడుతూ చాలా చోట్ల ఇళ్ల నిర్మాణ బిల్లులు పెండింగ్ ఉన్నాయని వివరించారు.
- కంచిలి ఎంపీపీ దేవదాస్ మాట్లాడుతూ వన్‌టైం సెటిల్‌మెంట్ విధానంలో పలు ఇళ్లకు ఇంకా పట్టాలను ఇవ్వలేదన్నారు.

నాడు-నేడు అమలు చేయాలి

శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలలను కాదని, ఎన్‌రోల్‌ను బట్టి రాష్ట్ర స్థాయిలో నాడు–నేడు అభివృద్ధి పనుల అమలుకు పాఠశాలలను ఎంపిక చేయడంపై పునరాలోచించాలి. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాతే మూడో విడతలో అయినా నాడు–నేడు పనులకు పాఠశాలలను ఎంపిక చేయాలి.

– కంబాల జోగులు, ఎమ్మెల్యే. రాజాం.

మన్యం అధికారులు రావాలి

ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి మన్యం జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి. హాజరు కాని వారిపై చర్యలు తీసుకోవాలి. పాలకొండ నియోజకవర్గంలో సుమారు 90 చోట్ల సచివాలయాల ఉద్యోగుల పోస్టులు ఖాళీలున్నాయి. భర్తీ చేయాలి.

– విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే పాలకొండ.

మళ్లీ జగనే సీఎం

మళ్లీ వైఎస్ జగనే సీఎం అవుతారు. అందులో డౌటే లేదు. జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్ర సుభిక్షంగా ఉంటుంది. మళ్లీ సర్వసభ్య సమావేశాలకు విజయనగరం, మన్యం జిల్లా కలెక్టర్లను ఆహ్వానిస్తే మంచి ఫలితాలుంటాయి.

– పాలవలస విక్రాంత్, ప్రభుత్వ విప్

తుఫాన్ దృష్ట్యా పలు రైళ్లు రద్దు

భువనేశ్వర్: మిచాంగ్ తుఫాన్ దృష్ట్యా తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధి నుంచి బయల్దేరుతున్న రైళ్లతో పాటు ఈ మార్గం గుండా రాకపోకలు చేసే పలు ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలను రద్దు చేసినట్లు అధికారులు శనివారం ప్రకటించారు. ప్రయాణికుల భద్రత కోసం రైల్వేశాఖ ఈ మేరకు నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తూర్పు కోస్తా రైల్వే గుండా రవాణా అయ్యే 54 ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలను రద్దు చేశారు. ఈ జాబితాలో తూర్పు కోస్తా రైల్వే నుంచి ఆరంభమయ్యే 12 రైళ్లు, ఈ జోన్ గుండా రవాణా అయ్యే 42 రైళ్లు, పూరీ నుంచి బయల్దేరే చెన్నై ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ నుంచి బయల్దేరే తిరుపతి, బెంగుళూరు ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం నుంచి బయల్దేరే చెన్నై, తిరుపతి, కడప ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

‘ఖైదీలకు సదుపాయాలు కల్పించాలి’

గార: ఖైదీలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలు కల్పించాలని, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన శనివారం అంపోలు జిల్లా జైలును సందర్శించారు. జైలులోని ఖైదీలతో వ్యక్తిగతంగా మాట్లాడారు. వంటశాలలో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సరుకులు నిల్వ చేసే గోడౌన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నబీఖాన్, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, జైలర్ ఉదయభాస్కర్, డిప్యూటీ జైలర్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సెమిస్టర్ పరీక్షల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు శనివారం పరిశీలించారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. వర్సిటీలో ప్రారంభించిన నాలుగేళ్ల సమీకృత డిగ్రీ క్లాస్‌వర్క్‌ను కూడా వీసీ శనివారం పరిశీలించారు.

ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనండి

కాశీబుగ్గ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కోరారు. పలాస మంత్రి క్యాంప్ కార్యాలయం పరిధిలో ఉన్న క్రీడా మైదానంలో ఆయన బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు. విద్యార్థులు ఆటల పోటీల కోసం పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.



పలాసలో బ్యాటింగ్ చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

ప్రతిభను నిరూపించే వేదిక

- ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా నిర్వహణ
- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



ప్రాక్టీసుకు సిద్ధమవుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ కోరారు. ప్రతిభను నిరూపించుకోవడానికి ఇది సరైన వేదిక అన్నారు. దీనికి సంబంధించి జిల్లాలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ నెట్స్‌లో యువత, బాలబాలికలతో కలిసి కలెక్టర్ కాసేపు ప్రాక్టీస్ చేశారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాల్గొనే యువత, విద్యార్థుల రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో డిసెంబర్ 15 నుంచి ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీల నిర్వహణకు శ్రీకారం చుడుతున్నట్టు తెలిపారు.

ప్రతిభకు ప్రోత్సాహం..

15 ఏళ్లు నిండిన యువత, క్రీడాకారులు, విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలకు శ్రీకారం చుట్టిందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. 15 ఏళ్లు పైబడి, ఆసక్తి కలిగిన బాలబాలికలు వెబ్‌సైట్ ద్వారా, యాప్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. సచివాలయాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీల నిర్వహణ ఉంటుందని తెలిపారు. ఇందులో పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రీడలు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 15 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఈ ఐదు క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని కలెక్టర్ చెప్పారు. స్థానికంగా గణనీయమైన ఆదరణ కలిగిన సంప్రదాయ క్రీడలను కూడా నిర్వహించడానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సచివాలయం స్థాయిలో క్రీడలన్నీ 12 రోజులపాటు కొనసాగుతాయని అన్నారు. ఈ పోటీలో పాల్గొనేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అర్హులు కారని స్పష్టం చేశారు. క్రీడాకారులకు కిట్లతో పాటు విజేతలకు భారీగా బహుమతులు ఉంటాయన్నారు.

నియోజకవర్గంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో నాలుగు అంశాల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.35వేలు, రెండో బహుమతిగా రూ.15వేలు, మూడో బహుమతిగా రూ.10వేలు నగదు బహుమతి ఇస్తారని కలెక్టర్ చెప్పారు. జిల్లాస్థాయి విజేతలకు మొదటి బహుమతిగా రూ. 60వేలు, రెండో బహుమతిగా రూ. 30వేలు, మూడో బహుమతిగా రూ. 10వేలు అందజేస్తారని చెప్పారు. రాష్ట్ర స్థాయి విజేతలకు మొదటి బహుమతిగా రూ. 5లక్షలు, రెండో బహుమతిగా రూ. 3లక్షలు, మూడో బహుమతిగా రూ. 2లక్షలు ఇవ్వనున్నారని తెలిపారు.

ఆదర్శంగా ధాన్యం కొనుగోళ్లు

పోలాకి: రాష్ట్రంలో రైతుల కోసం చేపట్టే ప్రతి కార్యక్రమం ఆదర్శంగానే జరుగుతుందని, ధాన్యం కోనుగోలు సైతం ఆదర్శంగా జరగాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అధికారులకు సూచించారు. ఆయన శనివారం పోలాకిలో వ్యవసాయశాఖ అధికారి చిరంజీవి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దళారీల వ్యవస్థ లేకుండా రైతులు స్వేచ్ఛగా తమ పంటను విక్రయించుకోవచ్చని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు.

కార్యక్రమంలో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కె.కృష్ణారావు, ఏడీఏ రవీంద్రభారతి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



తేమశాతం సరిచూసే మిషన్ పనితీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

జాప్యం లేకుండా పరీక్ష ఫలితాలు



డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో జాప్యం లేకుండా పరీక్ష ఫలితాల విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ పాలక మండలి కార్యాలయంలో ప్రతి నెల మొదటి శనివారం నిర్వహించే డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య నిర్వహించారు. ఈ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమానికి పలు ఫోన్ కాల్స్ వచ్చాయి. డిగ్రీ రెండో సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాల్లో జాప్యంపై విద్యార్థులు ప్రశ్నించగా, వారం రోజుల్లో ఫలితాలు వెల్లడించి, జ్ఞానభూమి పోర్టల్‌లో ఉంచనున్నట్లు వీసీ చెప్పారు. ఒరిజనల్ డిగ్రీ ధ్రువీకరణ పత్రాలు అందజేయటంలో జాప్యంపై ప్రశించగా, భవిష్యత్‌లో కాల వ్యవధి నిర్ణయించి జారీకి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 2018 స్పెషల్ డీఎడ్ విద్యార్థి ఉపకార వేతనం సమస్య ప్రస్తావించగా, పరిశీలిస్తామని అన్నారు. పీజీ కోర్సుల్లో స్పాట్ వాల్యుయేషన్‌పై కొందరు ప్రశ్నించగా, ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రవేశాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ సీహెచ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన యువకుడు అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : నాలుగు చోట్ల 50 గ్రాముల బంగారం చోరీ చేసిన యువకుడు నగరంలోని భైరివానిపేట కూడలి సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎన్.లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. రూరల్ మండలం కరజాడ గ్రామానికి చెందిన బలగ హరిబాబు ఈ ఏడాది ఫిబ్రవరి, అక్టోబరు నెలల్లో నగరంలోని నాయుడుచెరువుగట్టు సమీప నివాసం, పీఎన్ కాలనీలో ఓ నివాసంలో దొంగతనానికి పాల్పడ్డాడు. ఇదే గాక రణస్థలం మండలం జేఆర్ పురం పరిధిలో 30 గ్రాముల బంగారం, రాజాంలో ఓ పల్సర్ బైక్ దొంగిలించాడు. పోలీసులు అతని నుంచి మొత్తంగా 26 గ్రాముల బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకుని హరిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అంతర్జాతీయ పోటీల్లో హరికృష్ణ ప్రతిభ

ఆమదాలవలస రూరల్: ఒడిశా రాష్ట్రం పూరీలో జరుగుతున్న అంతర్జాతీయ సైకత శిల్ప కళా ఉత్సవాల్లో తన శిల్పం ఉత్తమ శిల్పంగా ఎంపికైందని సైకత శిల్పి గేదెల హరికృష్ణ శనివారం తెలియజేశారు. పర్యావరణాన్ని ఎలా పరిరక్షించాలో, వాటి వల్ల మానవునికి కలిగే లాభాల గురించి, అడవులు, జంతువులను సంరక్షించడం వలన కలిగే లాభాల గురించి సైకత శిల్పం రూపంలో వివరించగా ఈ శిల్పాన్ని సెలెక్ట్ కమిటీ ఎంపిక చేసినట్లు తెలియజేశారు.



అంతర్జాతీయ సైకతశిల్ప కళా ఉత్సవాల్లో గేదెల హరికృష్ణ రూపొందించిన సైకత శిల్పం